క్లుప్తంగా

విగ్రహాలకు విశిష్ట పూజలు



విగ్రహాలకు క్షీరాభిషేకం, పూజలు చేస్తున్న దాత బాబూరావు కుటుంబ సభ్యులు, భక్తులు

కరప: స్థానిక నీలయ్యతోట వీధిలో పునర్నిర్మించిన రామాలయంలో ప్రతిష్ఠించనున్న సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహాలకు గురువారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దాతలు లకమన బాబూరావు కుటుంబ సభ్యులు వియత్నాం దేశం నుంచి రూ.3 లక్షలు విలువచేసే స్వామివార్ల పాలరాతి విగ్రహాలను తీసుకొచ్చి ఆలయానికి సమర్పించారు. వేదపండితులు కొక్కిరిగడ్డ సుబ్రహ్మణ్యం, మణికంఠల ఆధ్వర్యంలో వేద పండితులు గురువారం ఉదయం విఘ్నేశ్వరపూజ, సర్వతోభద్ర మండపారాధన, దేవత హోమాలు, క్షీరాధివాసం తదితర పూజలు నిర్వహించారు.

అధ్వానంగా మరుగుదొడ్లు



మరుగుదొడ్ల పరిస్థితి ఇదీ..

కరప: స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరానికి నిర్మించిన మరుగుదొడ్లు అధ్వానంగా తయారయ్యాయి. రెండు మరుగుదొడ్లలో ఒకదానికి తలుపు పూర్తిగా ఊడిపోయి, మరొకదాని నిర్వహణ సరిగా లేక కుక్కలకు ఆవాసంతా తయారైంది. సమావేశ మందిరానికి పక్కనే మండల మహిళా సమాఖ్య భవనం ఉంటుంది. మండల సమావేశాలు, మహిళా సమాఖ్య సమావేశాలు జరిగే సందర్భాల్లో వాటిని వినియోగించుకునే అవకాశం లేక మహిళలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ముగిసిన కుట్టు మెషీన్ శిక్షణ



లబ్ధిదారులకు కుట్టు మెషీన్లు అందజేస్తున్న విదోస్ హోం వ్యవస్థాపక ధర్మకర్త రామకృష్ణారావు

బోట్‌క్లబ్: దాత ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని విడోస్ హోం వ్యవస్థాపక ధర్మకర్త పైండా రామకృష్ణారావు తెలిపారు. స్థానిక సూర్యారావుపేటలోని విడోస్ హోంలో నాలుగు నెలలుగా నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మెషీన్ శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. వందలాది మంది ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని వారి కుటుంబాలకు ఆసరాగా నిలిచారని ఆయన అన్నారు. శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. ఆరుగురు వితంతువులకు ఉచితంగా కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విడోస్ హోం సీనియర్ అసిస్టెంట్ నాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పంచలోహ ఉత్సవ విగ్రహాలు అందజేత



శివశంకరావు దంపతులు అందించిన సీతారామ, లక్షణ సమేత ఆంజనేయస్వామి పంచలోహ విగ్రహాలు

బోట్‌క్లబ్: స్థానిక రామారావుపేటలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలోని సీతారామ ఆలయానికి కాకర్ల శివశంకరరావు, విజయకుమారి దంపతులు గురువారం సీతారామ, లక్షణ సమేత ఆంజనేయస్వామి వార్ల పంచలోహ ఉత్సవ విగ్రహాలను అందజేశారు. ఈ విగ్రహాలకు రెండురోజుల పాటు శాస్త్రోక్తంగా సంప్రోక్షణ చేసి ఆలయంలో ఉంచుతామని ఆలయ అర్చకులు మోగంటి నాగభోగేశ్వరశర్మ తెలిపారు. విగ్రహాలు అందించిన దాతలకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ బాదం శ్రీనివాసు పాల్గొన్నారు.

రేపు జగ్జీవన్‌రామ్ జయంతి

కాకినాడ సిటీ: డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించనున్నట్టు కలెక్టర్ షణ్మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9.30 గంటలకు కాకినాడ లయన్స్ లేడీస్ రిక్రియేషన్ క్లబ్ వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించనున్నట్టు ఆయన తెలిపారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

వంతెనతోనే వెతలూ..!



వంతెన పక్కన గతుకుల మట్టి రోడ్డు



స్పీడ్ బ్రేకర్లు లేని రహదారి

- సర్వీస్ రోడ్లు లేక సమస్యలు
- స్పీడ్ బ్రేకర్లు వేయకపోవడంతో ప్రమాదాలు
- వంతెన నిర్మించి ఏడాదైనా పూర్తి కాని పనులు

కాకినాడ లీగల్: రామారావుపేట–కొండయ్యపాలెం వంతెన ప్రారంభించి ఏడాదైనా సమస్యలు మాత్రం ఎక్కడివక్కడే ఉన్నాయి. వంతెనకు అటు ఇటు సర్వీస్ రోడ్డు వేయకపోవడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో నిధులు మంజూరు చేసి ఈ వంతెనను నిర్మించి ప్రారంభించారు. ఆయన అనంతరం వచ్చిన ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడంతో సరైన రోడ్లు లేక తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తి ప్రజలు అవస్థలు పడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ఏడాది ముత్తా వారధిగా ఈ వంతెనకు నామకరణం చేసి ప్రారంభించారు. అయితే బ్రిడ్జి ఇరువైపుల స్థానిక ప్రాంతాలను ఆనుకుని ఉన్న రహదారికి కలుపుతూ రోడ్లు నిర్మించాల్సి ఉంది. ఈ రహదారులు నిర్మించకపోవడంతో చిన్నపాటి వర్షానికే స్థానిక పరిసరాలు చెరువుల్లా మారిపోవడంతో ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల పాలవుతున్నారు. వర్షాలకు ఈ రహదారులు మురికికూపంగా మారిపోయి అధ్వానంగా తయారవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అలాగే రామారావుపే –కొండయ్యపాలెం బ్రిడ్జికి కొండయ్యపాలెం వైపు స్పీడ్ బ్రేకర్ వేశారు కానీ, రామారావుపేట వైపు నాలుగు రోడ్లతో ఉన్న జంక్షన్‌లో రెండు మార్గాలకు స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వేగంగా వచ్చే వాహనాల వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఆయా మార్గాల వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారులు నిర్మించండి



రామారావుపేట–కొండయ్యపాలెం బ్రిడ్జి ప్రాంతంలో దశాబ్ద కాలంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. బ్రిడ్జి నిర్మాణం జరిగినప్పటికీ ఇరువైపులా రోడ్లు నిర్మించకపోవడంతో వర్షాకాలంలో అవస్థలకు గురవుతున్నాం. మట్టి రోడ్డుగా ఉన్న ఈ రోడ్డు గోతుల మయం కావడంతో వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లు నిర్మించాలి.

జీఎస్‌ఆర్ కృష్ణారావు, కాకినాడ

స్పీడ్ బ్రేకర్లు వేయాలి



రామారావుపేట వైపు దిగే బ్రిడ్జికి మరో రెండు వైపుల స్పీడ్ బ్రేకర్లు వేయాలి. బ్రిడ్జి డౌన్‌లో శివాలయం జంక్షన్ ఉండడంతో వేగంగా వచ్చే వాహనచోదకులతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు వేయాలి. అలాగే వంతెనకు ఇరువైపులా రహదారిని నిర్మించాలి.

– బడుగు బాబూ రాజేంద్రప్రసాద్, న్యాయవాది, కాకినాడ

ఎంఎస్‌ఎన్ పీజీ సెంటర్‌లో వీసీ తనిఖీ

కాకినాడ రూరల్: తిమ్మాపురం గ్రామం అచ్చంపేట జంక్షన్ వద్ద గల నన్నయ ఎంఎస్‌ఎన్ పీజీ సెంటర్‌ను నన్నయ యూనివర్శిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్న శ్రీ గురువారం తనిఖీ చేశారు. క్యాంపస్ ఆవరణ, కార్యాలయాలను, వసతి గృహాలను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యాలయంలో సిబ్బంది హాజరు, పనితీరును ప్రిన్సిపాల్ ప్రశాంతిశ్రీని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పీజీ అడ్మిషన్లు జరుగుతుండడంతో అన్ని కోర్సుల్లోని సీట్లు పూర్తి స్థాయిలో భర్తీ అయ్యేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అధ్యాపకులు సమయపాలన పాటించాలని సూచించారు.

అపరిశుభ్రతపై సీరియస్

పీజీ సెంటరు సందర్శనలో భాగంగా వసతి గృహాన్ని సందర్శించి సిబ్బందిపై వీసీ ప్రసన్నశ్రీ సీరియస్ అయ్యారు. వసతి గృహాన్ని, మెస్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు.



మెస్‌ను పరిశీలిస్తున్న నన్నయ వీసీ ప్రసన్న శ్రీ

పేదలకు దుస్తుల పంపిణీ

కాకినాడ సిటీ: బెరాకా మినిస్ట్రీస్ చేస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా పాస్టర్ల సంఘం అధ్యక్షులు దొమ్మేటి సామ్యూల్ సాగర్ అన్నారు. గురువారం కాకినాడ రూరల్ మండలం చీడిగ బెరాకా మినిస్ట్రీస్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా పేదలకు నూతన వస్త్రాలు, ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ బెరాక వ్యవస్థాపకుడు రెవరెండ్ బి.దివాకర్ ప్రజలలో మమేకమై క్రీస్తు ప్రేమను చాటే విధానంపై ప్రచారం చేయడం సంతోషకరంగా ఉందన్నారు. కుష్ఠు రోగులు, అంధులు, ఎయిడ్స్ రోగులు సుమారు 450 మందికి నూతన వస్త్రాలను, ఆర్థిక సాయం అందజేశారు. ప్రేమ విందును ఏర్పాటు చేసిన పాస్టర్ దివాకర్‌ను పాస్టర్లు అభినందించారు. దివాకర్ మాట్లాడుతూ దేవుడు మనకు ఇస్తున్న దానిలో కొంత పేదలకు ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు.



పేదలకు నూతన వస్త్రాలను అందజేస్తున్న సామ్యూల్ సాగర్ తదితరులు

బీచ్ అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



సూర్యారావుపేటలో బీచ్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ రూరల్: సూర్యారావుపేట బీచ్‌లో అభివృద్ధి పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని అధికారులను కలెక్టరు షణ్మోహన్ ఆదేశించారు. గురువారం ఆయన ఎమ్మెల్యే నానాజీతో కలసి పనులను పరిశీలించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు అసౌకర్యం కలగకుండా మెరుగైన సౌకర్యాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సముద్ర తీర ప్రాంతాల అభివృద్ధి చేపట్టిందన్నారు. ప్లాస్టిక్, తూటు, పిచ్చి మొక్కలు తొలగించి క్లీన్ అండ్ గ్రీన్‌గా బీచ్ పార్కు ఉండేలా చూడాలని కొడా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ ఇన్‌చార్జి అధికారి చైత్ర వర్షిణి, ట్రైనీ ఐపీఎస్ సుస్మిత, ఏపీడీటీసీ ఏఈ వెంకటేష్, కొడా ఈఈ రామారావు, జిల్లా పంచాయతీ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

భావనారాయణుని దర్శించిన కలెక్టర్

సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయాన్ని కలెక్టర్ షణ్మోహన్ గురువారం సందర్శించారు. ఆయనకు దేవదాయ శాఖ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు.

ఫుట్‌బాల్ క్లబ్ ట్రోఫీ జట్టుకు అభినందన

కాకినాడ సిటీ: అనంతపురం జిల్లాలో మార్చి 20 నుంచి 28వ తేదీ వరకు జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో గోదావరి జోన్ నుంచి గోదావరి ఫుట్‌బాల్ క్లబ్ విజేతలుగా నిలిచి రూ.5 లక్షల నగదును, ట్రోఫీ గెలిచిన జ ట్టును గురువారం కలెక్టర్ షణ్మోహన్ అభినందించా రు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌కుమార్, కోచ్ జె.శ్రీనివాస్‌రెడ్డి, కె. స్వామి శ్రీనివాసు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు తగ్గించాలి



విద్యుత్ భారాలకు నిరసనగా ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కాకినాడ సిటీ: ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం భారీగా వేస్తున్న విద్యుత్ చార్జీలకు నిరసనగా సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం కాకినాడ ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. చంద్రబాబునాయుడు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన సంగతి మరిచారని ఆందోళనకారులు విమర్శించారు. అదానీకి లాభాలు చేకూర్చే సెకి ఒప్పందం రద్దుచేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎప్పుడో వాడిన విద్యుత్‌కు ఇప్పుడు ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు, ఎఫ్‌పీపీసీఏ చార్జీల పేరుతో భారాలు వేయడం దారుణమన్నారు. అలాగే టైం ఆఫ్ ది డే పేరుతో విద్యుత్ కీలకంగా ఉపయోగించే సమయాల్లో యూనిట్ ధర పెంచాలనే ప్రతిపాదన దుర్మార్గమైన చర్య అని దుయ్యబట్టారు. అనంతరం ఈఈ ఉదయ్‌భాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా సీనియర్ నేత దువ్వా శేషుబాబ్జీ, నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యులు మలక వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలలో ఏం జరుగుతోంది?

- అభివృద్ధి పనులపై సభ్యుల అసంతృప్తి
- కరప మండల సమావేశంలో వివిధ శాఖల ప్రగతిపై సమీక్ష



సోలార్ విద్యుత్‌పై వివరిస్తున్న ఏఈ ఈశ్వరప్రసాద్

కరప: మండలంలోని కరప, వేళంగి గ్రామాల్లోని పీహెచ్‌సీలలో ఏం జరుగుతోందో తెలియడం లేదని, అభివృద్ధి కమిటీ సమావేశాలు నిర్వహించడం లేదని జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు తదితరులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కరప మండల పరిషత్ సమావేశం ఎంపీపీ పెంకె శ్రీలక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగింది. ఇందులో భాగంగా సభ్యులు వ్యక్తం చేసిన అభిప్రాయంపై కరప పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వి.ఏంజలిన్ బదులిస్తూ తాను కొత్తగా చేరానని త్వరలో అభివృద్ధి పనులు చేపడతానని చెప్పడంతో తదుపరి సమావేశంలో వివిధ అంశాలపై సమీక్షించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండల పరిధిలో 11,274 మందికి రూ.4.85 కోట్లు పింఛన్లు ఇస్తున్నామని, కొత్తగా 30 వితంతు, ఒక మెడికల్ పింఛన్ మంజూరు చేసినట్టు తెలిపారు. ఉపాధి పథకం ద్వారా పల్లెపండగ వారోత్సవాల్లో రూ.8.83 కోట్లతో 90 సీసీ రోడ్లకు 76 పూర్తయ్యాయని, మిగిలినవి పురోగతిలో ఉన్నాయన్నారు. తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్తరేషన్ కార్డులు ఇవ్వనున్నామని, గతంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలపై ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదించామని వివరించారు. ఎంఏఓ ఏవీ రాజేష్ మాట్లాడుతూ ఏపీఎఫ్‌ఆర్ పేరుతో విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం ఇప్పటి వరకు 9 వేల మంది రైతులు రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేసుకున్నారని, మిగిలినవారు కూడా నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యుత్‌శాఖ ఏఈ సానా ఈశ్వరప్రసాద్ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకుంటే ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు సబ్సిడీ ఇస్తారని మిగిలిన రూ.40 వేలకు బ్యాంక్‌ద్వారా రుణపరపతి కల్పిస్తారన్నారు. ప్రతిఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వీబీఎస్ వర్ధన్ మాట్లాడుతూ రూ.22 కోట్లతో చేపట్టిన 52 జల్‌జీవన్ మిషన్ పనుల్లో 23 పూర్తి అయ్యాయని తెలిపారు. ఎంపీడీఓ ఎం.అనుపమ, ఏఓ బీఎల్ నరసింహం, ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, మండల ఇంజినీరింగ్ అధికారి జి.శైలజ, డ్రైనేజ్ శాఖ ఏఈఈ శ్రీకాంతి, సీడీపీఓ వై.లక్ష్మి పాల్గొన్నారు.

తపాలా పెన్షనర్ల సంఘం నిరసన

బాలాజీచెరువు: పార్లమెంట్‌లో పెన్షనర్లకు వ్యతిరేకంగా ఆమోదం తెలిపిన బిల్లును రద్దుచేయాలంటూ స్థానిక తపాల ప్రధాన కార్యాలయం వద్ద పెన్షనర్లు నిరసన తెలియజేసారు. నేషనల్ కో–ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.రాఘవేంద్ర పిలుపు మేరకూ 8వ వేతన సవరణను అమలుచేయాలని నినాదాలు చేశారు. సంఘం అధ్యక్షుడు జీవీ లక్ష్మీనారాయణ, వైస్ ప్రెసిడెంట్ మార్కండేయేశ్వరరావు, కార్యదర్శి తురగా సూర్యారావుల ఆధ్వర్యంలో పోస్టల్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సుశీల, బాలకామేశ్వరి, అష్తాజ్ హుస్సేన్, వీరభద్రరావు, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న పెన్షనర్ల సంఘం సభ్యులు

సంపద తయారీ కేంద్రాల పరిశీలన

కాకినాడ రూరల్: మండలంలోని గంగనాపల్లి, కొవ్వాడ గ్రామాల్లో డీపీఓ వి.రవికుమార్ గురువారం పర్యటించారు. రెండు గ్రామాలలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించి పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు పలు సూచనలిచ్చారు. గృహస్తుల నుంచి తడి, పొడి చెత్తను రోజూ తీసుకుంటున్నారో లేదో క్లాప్ మిత్రలను అడిగి తెలుసుకున్నారు. ప్లాస్టిక్, చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు పంచాయతీ కార్యదర్శులు చూడాలను సూచించారు. కార్యక్రమంలో ఈఓ పీఆర్ అండ్ ఆర్డీ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు శ్రీకాంత్, కర్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గంగనాపల్లిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ

స్మార్ట్ సిటీ గడువు పెంచాలి

బోట్‌క్లబ్: స్మార్ట్ సిటీ గడువు ముగిసిపోవడంతో పొడిగించే చర్యలకు కూటమి ప్రభుత్వం శ్రద్ధ చూపకపోవడం అత్యంత విచారకరమని పౌరసంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అన్నారు. గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 2016లో రూ.10 వేల కోట్ల ఆర్థిక ప్యాకేజీ అవకాశం కల్పించినా ఐదేళ్లకు రూ.వెయ్యి కోట్ల పనులు మాత్రమే చేయడంతో పూర్తిస్థాయి స్మార్ట్‌సిటీ ఫలితాలు పొందలేదని, 2021లో రెండేళ్ల గడువు పొడిగించడం వల్ల మాజీ సీఎం జగన్ హయాంలో పెండింగ్ పనులు జరిగినప్పటికీ రూ. 180 కోట్లు పెండింగ్ నిధులు నేటికీ విడుదల కాలేదన్నారు. దేశంలో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు నిర్వహణ కొనసాగుతున్నందున కూటమి ప్రభుత్వం మరో రెండేళ్ల గడువు పొడిగించి విలీన గ్రామాలతో కార్పొరేషన్ ఎన్నికలు పూర్తి చేయించి ఆర్థిక సంఘం నిధులు వచ్చేలా కృషి చేయాలన్నారు.

వైభవంగా వసంత నవరాత్ర ఉత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామ స్వామి ఆలయంలో వసంత నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ అర్చకుడు పాణింగపల్లి మాధవాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి విశేష అర్చనలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుందరకాండ పారాయణ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో సీతారామస్వామి →



7న శృంగార వల్లభుని కల్యాణం

ఆహ్వాన పత్రికను విడుదల చేసిన ఎమ్మెల్యే రాజప్ప

పెద్దాపురం: స్వయంభూ తిరుపతి శృంగార వల్లభ స్వామి కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. స్వామి కల్యాణోత్సవాల ఆహ్వాన పత్రికను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్, తిరుపతి గ్రామ సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, కొత్తెం కొటిలు ఎమ్మెల్యే చిన రాజప్ప, కౌడా చైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజులకు అందజేశారు. అనంతరం ఆయనతో సమావేశమై ఉత్సవ ఏర్పాట్లను వివరించారు. ఈ నెల ఏడు నుంచి 13వ తేదీ వరకు కల్యాణోత్సవాలుంటాయని, 7వ తేదీన రాత్రి స్వామి దివ్య కల్యాణానికి రావాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ఆలయ పురోహితులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు తదితరులున్నారు.



కల్యాణోత్సవ ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే రాజప్పకు అందజేస్తున్న ఈఓ, సర్పంచ్

డ్రగ్స్‌తో ఉజ్వల భవితను కోల్పోవద్దు

- జిల్లా ఎస్పీ బిందుమాధవ్
- డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన

గండేపల్లి: విద్యార్థులు డ్రగ్స్ మాయలో పడి ఉజ్వల భవిష్యత్తును కోల్పోవద్దని జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ సూచించారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో సైబర్ నేరాల నివారణ, డ్రగ్స్ వద్దు బ్రో, శక్తి యాప్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు, వాటిని వినియోగించినా, రవాణా చేసినా పడే శిక్షలను సెక్షన్లతో సహా వివరించారు. డ్రగ్స్ కేసులో నేరం రుజువైతే తప్పనిసరిగా శిక్షలు అనుభవించాల్సి ఉంటుందన్నారు. యువత సన్మార్గంలో నడవాలన్నారు. విద్యార్థి దశ ఎంతో విలువైనదని, డ్రగ్స్ వంటి చెడు అలవాట్లతో జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. విపత్కర సంఘటనలు ఎదురైనప్పుడు కేవలం మొబైల్‌ను షేక్ చేయడం ద్వారా పోలీస్ అధికారుల రక్షణ లభిస్తుందని, ప్రతిఒక్కరూ శక్తి యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ చాన్సలర్ ఎన్.శేషారెడ్డి, ప్రో చాన్సలర్ ఎన్. సతీష్ రెడ్డి, డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ట్రైనింగ్ డీఎస్పీ సీహెచ్ జీవన, జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్, ఎస్సై యువి శివనాగబాబు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

వికాసలో 7న జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస, పిఆర్ గవర్నమెంట్ ఒకేషనల్ జూనియర్ కాలేజీ, కాకినాడ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల ఏడో తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఈ మేళాలో ఐటీసీ లిమిటెడ్ ఫుడ్స్ డివిజన్‌లో ఆపరేటర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. పై ఉద్యోగాలకు ఐటీఐ, ఇంటర్ (ఒకేషనల్) ఉత్తీర్ణులైన 29 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.11 వేల నుంచి రూ. 19,659 వరకు జీతం, బోనస్, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఏడో తేదీన పీఆర్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావచ్చన్నారు.

పేదలకు కళ్లజోళ్ల పంపిణీ



కళ్లజోళ్లను అందజేస్తున్న ట్రస్ట్ పూర్వ విద్యార్థులు

బాలాజీచెరువు: లయన్స్‌క్లబ్ కాకినాడ హాల్లో గురువారం బాదం బాలకృష్ణ క్లాత్ అండ్ ఐగ్లాస్ ప్రాజెక్టు ద్వారా 95 మంది పేదలకు కళ్లజోళ్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. రెడ్‌కాన్వెంట్ చారిటబుల్ ట్రస్ట్ పూర్వ విద్యార్థి కళ్యాణి, శ్రీను ప్రసాద్, ట్రస్ట్ చైర్మన్ బాదం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నుంచి ఇద్దరి సస్పెన్షన్

సామర్లకోట: నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్ సీపీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న ఇద్దరిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు విడుదల చేసింది. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణ మూర్తి, సామర్లకోట మండలానికి చెందిన ఎలిశెట్టి సూర్యనారాయణమూర్తి పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్టు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో పార్టీ క్రమ శిక్షణ కమిటీ సిపార్సుల మేరకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించారు.